## కరవు

మొదటి పేజీ తరువాయి

సరిదిద్దారు.

ఈ ప్రకటనలు, విన్నపాలు, పరిశీలనలు, పొరపాట్లను సరిదిద్దుకోవడాలతో నాలుగు నెలలు గడిచి పోయాయి. కాని కరవు నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనాటికీ ఒక్క పనీ చేపట్టలేదు; ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాలు, తెలంగాణాలోని అధిక భాగం గ్రామాలు నీళ్ల కోసం అల్లాడుతున్నాయి. వ్యవసాయ పనులు దాదాపుగా లేనట్లే. లక్షల మంది కూలీలు చేయడానికి పని లేక, తినడానికి తిండి లేక పట్టణాలకు వలస వచ్చేస్తున్నారు. హైదరాబాద్, బొంబాయి, నాగపూర్ వంటి సుదూర ప్రాంతాలకు పొట్ట చేత. బట్టుకొని వెళ్లిపోతున్నారు. పల్లెలన్నీ నిర్మానుష్యమై పోతున్నాయి.

ఇటువంటి నిర్భాగ్యులకు పని చూపించడానికి కేంద్ర ప్రభుత్వం మూడున్నర లక్షల టన్నుల బియ్యం ఉచితంగా ఇచ్చింది. వీటిని సద్వినియోగం చేస్తే కరవు వున్న ప్రతి గ్రామంలో ఏదో ఒక పని కల్పించి కూలీలకు దినం గడిచే ఏర్పాటు చేయవచ్చు. కాని పనికి ఆహార పథకం క్రింద 3,500కోట్ల రూపాయల భారీ నిధులు బొక్కిన తెలుగునేతలు. అధికారులకు ఇప్పుడు కొత్తగా వచ్చిన బియ్యాన్ని పేదలకు పంచడానికి మనసు రావడం లేదు. గ్రామ సభలు పెట్టాలని, యంత్రాల వాడకం లేకుండా పని జరిపించాలని, కలెక్టర్లు బాధ్యత స్వీకరించాలని రకరకాల ఆంక్షలు పెడుతున్నా ఈ బియ్యం సైతం దారి తప్పి పోతున్నాయి. అది వీలుకాని చోట్ల అసలు ఏ పని జరగడం లేదు. కాగితాల మీద పనులు సృష్టించి బిల్లులు దిగమ్రింగడానికైతే అందరూ పోటీ పడుతున్నారు తప్ప, పేద కూలీల పొట్ట నింపడానికి పని చేయమంటే ఎవరికి తీరిక వుంటుంది చెప్పండి? అందువల్లే ఇటు పంచాయతీరాజ్ ఇంజనీర్లు, అటు కలెక్టర్లు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వుండిపోతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతగా ఒక్క కరవు నివారణ చర్య సైతం చేపట్టక పోవడం మరీ విడ్డూరం. బడ్జెట్ నిధుల నుంచి కాని, కేంద్ర నుంచి వచ్చే వైపరీత్యాల నిధి నుంచి కాని ఈనాటి వరకు చిల్లి గవ్వ విడుదల చేయలేదు. దానితో అక్కడక్కడా వానలు పడి, వర్షాధారం పంటలు వేసుకొనే రైతులకు ప్రభుత్వం చెప్పిన సబ్సిడీ విత్తనాలు కాని, ఎరువులు కాని అందడం లేదు. వ్యవసాయ శాఖ పరంగా సలహాలు ఇచ్చే వారు కూడా లేరు. ఇటువంటి సందర్భాలలో తక్కువ కాలంలో దిగుబడి వచ్చే రకాలను నీటి ఎద్దడిని తట్టుకొనే రకాలను గుర్తించి, రైతులకు తగిన సలహాలు ఇవ్వవల్సిన వ్యవసాయ శాఖ మౌన ముద్రదాల్చి వున్నది. గ్రామాలలో వ్యవసాయ విస్తరణ పనులు చేపట్టడానికి వారి వద్ద సిబ్బంది లేరు; వ్యవసాయ పరిశోధనాలయాలలో పరిశోధనలు లేవు. జీతాలకు మాత్రం డబ్బు ఇచ్చి వ్యవసాయ శాఖను నిర్వీర్యం చేస్తున్నారు ముఖ్యమంత్రి.

కోస్తా జిల్లాల నుంచి గడ్డి కొనుగోలు చేసి మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాలకు సరఫరా చేసే పథకం కూడా కాగితాలకు, పత్రికా ప్రకటనలకు మాత్రం పరిమితమై వుంది.

కేంద్ర బృందం నివేదిక సమర్పించి రెండు నెలలు కావస్తున్నా వారి సిఫార్సుల ప్రకారం నిధులు ఎందుకు రావడం లేదో అడిగేవారు లేరు. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన రెండున్నర వేల కోట్లు ఇవ్వలేకపోయినా రెండు వందల కోట్లయినా ఇవ్వాలి కదా? తన అనుచరులకు గ్యాస్ కేటాయింపు జరగకపోతే, విద్యుత్ కర్మాగారాలకు ఆర్థిక సంస్థలు అప్పులు ఇవ్వకపోతే ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రుల ఇళ్లలో కూర్చొని అప్పటికప్పుడు ఉత్తర్వులు పుట్టించే ముఖ్యమంత్రికి కరవు బాధిత ప్రాంతాలకు కేంద్ర ఇవ్వవల్సిన సహాయాన్ని పట్టుబట్టి తెచ్చే తీరిక, ఓపిక లేకపోవడం విడ్డూరం.

దాదాపు సగం రాష్ట్రం కరవు కోరలలో చిక్కి విలవిలలాడుతుంటే ప్రభుత్వం ఇంత నిమ్మళంగా వుండిపోవడం; నిర్భాగ్య ప్రజలను అనాథలుగా వదిలి వేయడం దారుణ నేరం. ఈ అన్యాయాన్ని ప్రశ్నించేవారు ఎవరూ లేరా?

## మద్రాసుకు నీరు

2వ పేజీ తరువాయి

అందంగా అల్లిన కథ ఇది. చెరువులు నిండక పోవడానికి కారణం చాలినంత వాన కురవలేదు అనే అర్థంతో ఈ సమాచారం అందిస్తున్నారు అధికారులు. కాని అది పచ్చి మోసం. 13పదున్ల వాన కురిస్తే చెరువులన్నీ పొంగి, కలుజులు పారాలి. అది జరగక పోవడానికి కారణం వాన చాలక పోవడం కాదు, చెరువులలో నీళ్లు నిలవక పోవడం. గత ఏడాది కురిసిన వానలకు జిల్లాలోని కొన్ని వందల చెరువులకు గండ్లు పడ్డాయి. వాటి పూడికకు ఎంతో కొంత నిధులు కూడా వున్నాయి. కాని అధికారులు ఒక సంవత్సరం పాటు ఆ పని పట్ల శ్రద్ధ చూపడానికి నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా చెరువులలోకి వచ్చిన నీరు వచ్చినట్లే క్రిందకు జారిపోయింది. గండ్లు పూడ్చి వుంటే ఈ చెరువుల క్రింద దాదాపు రెండున్నర లక్షల ఎకరాలలో పైరు సాగు అయి వుండేది. ఇప్పుడు గండ్లు పూడ్చినా సుఖం లేదు. ఇక వానలు వస్తాయన్న నమ్మకం లేదు. ఒకవేళ వచ్చినా, ఇప్పుడు మొదలుపెట్టి గండ్లు పూడ్చడం అసాధ్యం. అంటే అధికారుల నిర్లక్ష్యం వల్ల రెండున్నర లక్షల ఎకరాలు ఒక ఏడాది పాటు బీడుపడి వుండబోతున్నాయన్న మాట. ఎంత క్రూరమైన నేరం ఇది? దీనికి ఎవరు బాధ్యత స్వీకరిస్తారు?

## నెల్లూరు ముచ్చట్లు

6వ పేజీ తరువాయి

### రాష్ట్ర కాంగ్రెస్ బిసి సెల్‌లో బాలకోటేశ్వరరావు

నెల్లూరులో కాంగ్రెస్ కార్యకర్తగా పనిచేస్తున్న ఎ.బాలకోటేశ్వరరావును రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బిసిసెల్ ఉపాధ్యక్షునిగా, ఈ సెల్ ఛైర్మన్ ఎం.ముఖేష్ నియమించారు.

### బాలికను ఆదుకొన్న కలెక్టర్

నెల్లూరు కోటమిట్టలోని గంజిఖానా ప్రాంతంలో అక్టోబర్ 6తేది కన్న తండ్రి చేతిలో అత్యాచారానికి గురైన బాలికకు జిల్లా కలెక్టర్ అనంతరాము 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం తరఫున చేశారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి కానిస్టేబుల్ కావడం, కుటుంబం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతుండడంతో ఎస్పీ రాజేంద్రనాథ్‌రెడ్డి కూడా ఈ కుటుంబాన్ని ఆదుకోమని కలెక్టర్‌ను ప్రత్యేకంగా కోరారు. బాలిక చదువుతోపాటు హాస్టల్ వసతిని కల్పిస్తానని కలెక్టర్, కేసు విచారణ సమయంలో పూర్తి రక్షణ కల్పిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. బాలికను జిల్లా కలెక్టర్, ఎస్పీల వద్దకు తీసుకెళ్లి వారి కుటుంబం పరిస్థితి తెలియజేసి సాయం అందించడంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ అండగా నిలచిందని బాధిత కుటుంబం తెలిపింది.




